


చేపల చెరువుపై వివాదం

దుద్యాల్ మండల పరిధిలోని హస్నాబాద్‌లో ఆరేళ్లుగా చేపల చెరువు వివాదం పరిష్కారం కావడం లేదు. 8లో▸



పీఎస్ ఎదుట ధర్నా

ఓ వ్యక్తిపై ఎస్ఐ మతపరమైన దూషణలు చేశారని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పీఎస్ ఎదుట ధర్నా నిర్వహించారు. 8లో▸



విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తా

వినియోగదారులు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 9లో▸

న్యూస్‌రీల్

ప్రధాని మోదీతోనే అన్ని వర్గాలకు న్యాయం

ఎమ్మెల్సీ అంజిరెడ్డి



అంజిరెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: ప్రధాని మోదీ పాలనలో దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. వికారాబాద్ పట్టణం మా శారద ఆస్పత్రి ఆవరణలోని సమావేశ మందిరంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ 2047 సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్ కార్యక్రమంతో గ్రామాలు, పట్టణాలను అందంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ప్రపంచ దేశాలతో పోటీపడి నేడు 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత దేశం నిలిచిందని.. ఇది మోదీ ఘనతేనని అన్నారు. పీఎం సడక్ యోజన కింద తెలంగాణలో 14వేల కిమీ మీటర్ల మేర రోడ్లు వేయించారని గుర్తు చేశారు. దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ అందిస్తు అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సంకల్ప సభ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నవీన్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీదేవి, పార్టీ మండల అధ్యక్షుడు శివరాజుగౌడ్, జిల్లా నాయకులు బస్వలింగం, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు పదోన్నతి



జాకీర్ అహ్మద్, కృపాకర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జాకీర్ అహ్మద్‌కు గ్రేడ్ -2 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఇది వరకు ఆయన వికారాబాద్‌లో గ్రేడ్ -3 కమిషనర్‌గా పని చేస్తున్నారు. ప్రభుత్వం జాకీర్ అహ్మద్‌కు పదోన్నతి కల్పిస్తూ ఇక్కడే పోస్టింగ్ ఇచ్చింది. వికారాబాద్ ఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న కృపాకర్‌ను బడంగ్‌పేట మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేసింది. దీంతో ఆయన రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురి అధికారులను ఘనంగా సన్మానించారు.

తెలంగాణ కబడ్డీ జట్టుకు గోపి ఎంపిక



అనంతగిరి: హరిద్వార్‌లో జరగనున్న నేషనల్ కబడ్డీ పోటీలకు తెలంగాణ జట్టుకు వికారాబాద్‌కు చెందిన క్రీడాకారుడు గోపి ఎంపికయ్యారు. మంగళవారం ఆయనను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పరుశరాం, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ అభినందించారు.

మళ్లీ కూల్చివేతలు



చించోళి రోడ్డులో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ఇందిరాచౌక్ నుంచి చించోళి రోడ్డు మార్గంలో మంగళవారం మున్సిపల్ అధికారులు, పోలీసులు కలిసి అక్రమ నిర్మాణాలను కూల్చివేసే ప్రక్రియను తిరిగి ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం బస్టాండు ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను తొలగించిన అధికారులు తాజాగా చించోళి రోడ్డు మార్గంలో తొలగింపులు ప్రారంభించారు. తాండూరు పట్టణం గుండా వెళ్తున్న నేషనల్ హైవే 167 (ఎన్) రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రైన్స్ నిర్మించారు. అయితే పలువురు చిరు వ్యాపారులు సైడ్ డ్రైన్స్ పైన డబ్బాల వంటివి ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అక్కడ నిలుపుతున్న వాహనాల వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో అక్కడి డబ్బాలను, షెల్టర్ రేకులను మున్సిపల్ అధికారులు తొలగించారు.



వికారాబాద్‌లోని ఆలంపల్లి రోడ్డు సమీపంలో పారబోసిన కుళ్లిన కూరగాయలు

వర్షాల వేళ.. నిర్లక్ష్యమేల!

మున్సిపాలిటీల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

- ఎక్కడ బడితే అక్కడ చెత్త పారబోత
- రోడ్లపై పారుతున్న మురుగు
- ఇష్టారాజ్యంగా చెత్త డంపింగ్
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

వికారాబాద్: మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం లోపించింది. కాలనీలు, ఇళ్ల మధ్య, రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోతున్నా పట్టించుకునే నాథులే కనిపించడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మున్సిపల్ అధికారుల పనితీరు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో వీధుల్లోని చెత్త కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈగల మోత పెరుగుతుండటంతో వ్యాధులు ప్రబలే అవకాశం కనిపిస్తోంది. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండేలానే అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణాల్లో చెత్త సేకరణ సక్రమంగా సాగడం లేదు. ఇళ్లు, కాలనీల నుంచి సేకరించిన చెత్తను ఆయా ప్రాంతాల శివారుల్లో డంపింగ్ చేస్తున్నారు. దీంతో అక్కడ నివసించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు, ఈగలు పెరిగి రాత్రి వేళ నిద్ర పట్టడం లేదని స్థానికులు తెలిపారు. తడిపొడి చెత్తను కలిసి ఒకే చోట డంపింగ్ చేయడంతో శివారు ప్రాంతాలు కంపు కొడుతున్నాయి. మురుగు కాల్వలను కూడా సకాలంలో శుభ్రం చేయడం లేదు. దీంతో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు నీరు ముందుకు కదలడం లేదు. జిల్లా కేంద్రం వికారాబాద్‌లో చిన్నపాటి వర్షం కురిసినా డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రోడ్లు మురుగుతో నిండిపోతున్నాయి. ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

పడకేసిన పాలన

పట్టణాల్లో, మున్సిపాలిటీల్లో పాలన పడకేసింది. ప్రజాప్రతినిధులు ఉన్న సమయంలో పారిశుద్ధ్యంపై స్పందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన సాగుతుండటంతో పారిశుద్ధ్యంపై పట్టించుకునే వారే కరువయ్యారు. పురపాలక సంఘాల పరిధిలోని చాలా కాలనీలు దుర్గంధంతో నిండిపోయాయి. నివాసాల మధ్య మురుగు పేరుకుపోయి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఉదయం లేవగానే కాలనీల్లో తిరుగుతున్నట్టు కలరింగ్ ఇస్తున్న కమిషనర్లు.. పనులు పర్యవేక్షిస్తున్నట్లు ఓ ఫొటో దిగి ఉన్నతాధికారులకు పోస్ట్ చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఒక్కో మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు పరిష్కారం కావడం లేదు. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ అధ్వానంగా తయారయ్యింది. మున్సిపాలిటీల్లో కంపోస్టు ఎరువుల తయారీ యూనిట్లు నెలకొల్పినా ఆ తర్వాత అవి మూలకు చేరాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- మోమిన్‌పేట రైతు వేదికలో రైతు భరోసా విజయోత్సవాలు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించిన అధికారులు, రైతులు
- పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్ జైన్

మోమిన్‌పేట: రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం మోమిన్‌పేట రైతు వేదికలో రైతు భరోసా విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ నుంచి ప్రసారమైన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి సబ్సిడీలకు మంగళం పాడిందని ఆరోపించారు. బిందు సేద్యం, తుంపర సేద్యం, వ్యవసాయ పరికరాలు, సబ్సిడీ విత్తనాలు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీలతోపాటు రైతు భరోసా కూడా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్నాలకు బోనస్ ఇచ్చి అన్నదాతకు అండగా నిలుస్తోందని తెలిపారు. అనంతరం మండలంలోని 14 మంది రైతులకు 75శాతం సబ్సిడీపై తుంపర సేద్యం పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ఎంపీడీఓ యాదగిరి, ఆర్‌ఐ గోవర్ధన్, వ్యవసాయ శాఖ ఏడీ శంకర్ రాథోడ్, ఏఈఓ ఓలు చంద్రిక, పెంటయ్య, శ్రీనివాస్, అక్షిత తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేద్దాం

మోమిన్‌పేట: సహకార సంఘాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత రైతులపై ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని బాల్‌రెడ్డి గూడెంలో రూ.70 లక్షలతో, ఎన్కేపల్లిలో రూ.70 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, కేసారంలో రూ.3.06 కోట్లతో నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మోమిన్‌పేటలో డీసీసీబీ నూతన భవనాన్ని చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమర్షియల్ బ్యాంకులకు దీటుగా సహకార సంఘాలు రైతులకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. కర్షక్ మిత్ర, రైతుల పిల్లల విదేశీ చదువులకు రుణాలను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. రైతులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అమితమైన ప్రేమ ఉందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, పంటల బీమా అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దీంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలో పంచాయతీ, ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు కానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి, సీఈఓ సుబ్రహ్మణ్యం, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు విష్ణువర్ధన్‌రెడ్డి, అంజిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డి, మండల ప్రత్యేక అధికారి సదానందం, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు సురేందర్, నరోత్తంరెడ్డి, మహంత్‌స్వామి, సిరాజొద్దీన్, నర్సింలు, విఠల్, మల్లయ్య, మాణయ్య, రవి, వెంకటయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతుకు సబ్సిడీ పరికరాల మంజూరు పత్రం అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్

డ్రగ్స్ నిర్మూలన మన బాధ్యత

ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: డ్రగ్స్ నిర్మూలన మన బాధ్యత అని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, బాలికలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించి నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అటువంటి నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు పడేలా వివరాలు సేకరించి కేసులు నమోదు చేయాలని సూచించారు. అవసరమైతే వారిపై రౌడీ షీట్‌లు తెరవాలని, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలకు గల కారణాలు తెలుసుకొని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణా, గుట్కా విక్రయాలు, పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిఘా పెట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకమని, ప్రజల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచి అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ టీవీ హనుమంత్ రావు, జిల్లాలోని డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు సిద్ధం కండి

- వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

అనంతగిరి: వర్షాలు పడుతున్న నేపథ్యంలో మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే.రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వన మహోత్సవ కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్.. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రయినీ కలెక్టర్ హర్ష్ చౌదరితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లు, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్ సాగు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. వర్షాలు పడుతున్నందున పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని తెలిపారు. ఇందు కోసం అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన భూ భారతి సదస్సుల ద్వారా 11,802 అర్జీలు స్వీకరించామని, 7,583 దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు చేయడం జరిగిందన్నారు. రైతులు ఇచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. క్షయ వ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం టీబీ ముక్త్ భారత్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కన్న కూతురే.. కర్కశంగా మారే..

ప్రియుడితో తల్లిని చంపించిన పదో తరగతి బాలిక

- తమ ప్రేమకు అడ్డుగా ఉందని ఘాతుకం
- ఇన్‌స్టాలో పరిచయమైన యువకుడితో కలిసి దారుణం
- జీడిమెట్ల పరిధిలో కలకలం రేపిన ఘటన

జీడిమెట్ల: 'నువ్వు వచ్చి మా అమ్మను చంపు.. లేదంటే నీ పేరు రాసి నేను ఆత్మహత్య చేసుకుంటా'నంటూ ప్రియుడిని బెదిరించిన పదో తరగతి బాలిక.. కన్నతల్లినే హత్య చేయించిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం కలకలం రేపింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన సట్ల అంజలి(39)కి 16 ఏళ్ల క్రితం దమ్మన్నపేటకు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. వీరికి కూతురు (15) ఉంది. 13 సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో అంజలి కుప్పంకు చెందిన రవి అనే వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. మనస్విని (12) అనే కూతురు జన్మించింది. రవి సైతం గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అంజలి కొన్నేళ్లుగా తెలంగాణ సాంస్కృతిక సారథి విభాగంలో కళాకారిణిగా పని చేస్తూ.. తన ఇద్దరు కుమార్తెలతో కలిసి మూడు నెలలుగా షాపూర్‌నగర్ హెచ్‌ఎంటీ సొసైటీలోని ఓ ఇంట్లో కిరాయికి ఉంటోంది. షాపూర్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పెద్ద కుమార్తె 10వ తరగతి, చిన్న కూతురు 8వ తరగతి చదువుతున్నారు.



అంజలి (ఫైల్)



శివ

ఇన్‌స్టాలో పరిచయంతో..

అంజలి పెద్ద కుమార్తె (15)కు నల్లగొండ జిల్లా కట్టంగూర్‌కు చెందిన శివ (18)కు ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ప్రేమకు దారితీసింది. 8 నెలలుగా ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఈ విషయాన్ని బాలిక తల్లికి చెప్పింది. ఇద్దరి సామాజిక వర్గం ఒకటే కావడంతో అంజలి తొలుత అంగీకరించి.. ఆ తర్వాత వద్దని వారించింది. తమ ప్రేమకు తల్లి ఒప్పుకోకపోవడంతో బాలిక ఈ నెల 19న శివతో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయింది. అదేరోజు అంజలి తన కూతురు కనిపించడం లేదంటూ శివపై అనుమానం వ్యక్తం చేస్తూ జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పోలీసులు అమ్మాయిని తీసుకుని స్టేషన్‌కు రావాలని చెప్పడంతో ఈ నెల 21న శివతో పాటు బాలిక పీఎస్‌కు వచ్చారు. బాలికను తల్లితో ఇంటికి పంపించారు.



తల్లి మృతదేహంపై పడి రోదిస్తున్న చిన్నకుమార్తె మనస్విని

ప్రేమకు నిరాకరించిందని..

ఇంటికి వెళ్లిన తర్వాత శివను వదిలేసి చదువుపై దృష్టి పెట్టాలని కూతురును అంజలి బెదిరించింది. శివపై కేసు పెట్టించి జైలుకు పంపిస్తానంటూ కొట్టింది. తమ ప్రేమకు అడ్డొస్తోందనే కసితో తల్లిపై కోపం పెంచుకున్న బాలిక ఆమెను చంపాలని గట్టిగా నిర్ణయించుకుంది. తాను అనుకున్నట్లుగానే తన తల్లిని హైదరాబాద్ వచ్చి చంపాలని శివను కోరింది. చంపకపోతే నీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానని శివను బెదిరించింది. దీంతో యువకుడు ఒప్పుకోవడంతో.. బాలిక తన చెల్లెలిని మరో ఇంటికి పంపించింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు శివ, తన తమ్ముడిని (16) తీసుకుని షాపూర్‌నగర్ వచ్చాడు. వచ్చీ రావడంతోనే కుర్చీలో కూర్చున్న అంజలిని ఒక్కసారిగా తోయడంతో ఆమె ముందుకు పడి తలకు గాయమైంది. వెంటనే అంజలి మెడకు గట్టిగా చున్నీ బిగించడంతో ఆమె కొట్టుకోసాగింది. శివ సోదరుడు అంజలి చేతులు పట్టుకోగా శివ చున్నీతో మెడకు గట్టిగా అదిమి పట్టుకున్నాడు. అంజలి ముక్కులోంచి తీవ్ర రక్తస్రావం కావడంతో చనిపోయిందని నిర్ధారించుకున్నారు. తన తల్లి కిందపడి తలకు దెబ్బతగలంతో చనిపోయిందని అందరినీ నమ్మించాలని బాలిక పథకం పన్ని, శివను, అతని సోదరుడిని పంపించేసింది.

అంజలి చాకలి ఐలమ్మ మునిమనవరాలు కాదు..

మృతురాలు అంజలి చాకలి ఐలమ్మకు దూరపు బంధువే తప్పా మునిమనవరాలు కాదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై మీడియాలో వార్తలు నిజం కావన్నారు.

బతికే ఉందని.. మళ్లీ రప్పించి..

కొద్దిసేపటి తర్వాత అంజలి మెల్లగా కదలసాగింది. అప్పటికే చిన్న కుమార్తె మనస్విని ఇంటికి రాగా.. అమ్మ ఇంట్లోకి రావొద్దని చెప్పిందంటూ సోదరిని బాలిక బయటే కూర్చోబెట్టింది. 108కు కాల్ చేసినట్లు నటిస్తూ విషయాన్ని ప్రియుడు శివతో మాట్లాడింది. తన తల్లి ఇంకా బతికే ఉందని చెప్పింది. నల్లగొండ వెళ్లేందుకు ఎల్‌బీనగర్‌లో ఉన్న శివ మళ్లీ తన సోదరుడిని తీసుకుని రాత్రి 7.30 గంటలకు షాపూర్‌నగర్ వచ్చాడు. 'ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. నిన్ను కాపాడతాను ఆంటీ' బాలిక మనస్విని ముందు నటించాడు. వేరే ఆంటీని పిలుచుకు రావాలంటూ ఆమెను ఇంట్లోంచి పంపించారు. తిరిగి అంజలి మెడకు చున్నీ బిగించారు. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాత్రి 10 గంటలకు తన తల్లి చనిపోయిందని పెద్ద కుమార్తె బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. రాత్రి 11 గంటల తర్వాత జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేశ్‌కు విషయం తెలిసింది. ఈ నెల 19న బాలిక అదృశ్యమైన కేసు జీడిమెట్లలో నమోదు కావడంతో ఇది కచ్చితంగా హత్యేనని నిర్ధారణకు వచ్చారు. వెంటనే రెండు బృందాలను రంగంలోకి దింపి శివను కట్టంగూరులో అదుపులోకి తీసుకున్నారు. అతడి సోదరుడు (15)ను హైదరాబాద్ సంతోష్‌నగర్‌లోని ఓ చికెన్ సెంటర్‌లో అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు నిందితులను విచారణ చేయగా.. అంజలిని తామే చంపివేశామని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. తన తల్లిని పూర్తిగా చంపే వరకు ఇంటి బయటే కాపలా కాసిందని, తల్లి మృతదేహాన్ని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా 'క్షమించు మమ్మీ' అంటూ నిందితురాలు బాలిక రోదించిందని స్థానికులు తెలిపారు. అంజలి మృతదేహాన్ని స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లాలోని ఇనుగుర్తికి తరలించినట్లు పోలీసులు చెప్పారు.

క్లుప్తంగా

క్షయ వ్యాధి నివారణకు కృషి



ఈర్లపల్లి వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

దౌల్తాబాద్: క్షయ వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి అమూల్య అన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ ఆధ్వర్యంలో మంగళవారం ఈర్లపల్లి గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమూల్య మాట్లాడుతూ.. శిబిరంలో 160 మందికి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. వ్యాధి సోకిన వారు జ్వరం, దగ్గు, నీరసం, బరువుతగ్గడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలుంటే తప్పక వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి సౌమ్య, సూపర్‌వైజర్ రఫీ, రాహత్‌శ్రీధర్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తుల పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు



కాలిబూడిదైన వస్తువులు

కుల్కచర్ల: షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లో మంటలు చెలరేగి నగదు, సౌండ్ సిస్టం అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన కుల్కచర్ల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, ఎస్‌ఐ రమేశ్ తెలిపిన ప్రకారం.. చౌడాపూర్ గ్రామానికి చెందిన తొంట చిన్నయ్య సోమవారం రాత్రి ఇంట్లో రూ.1.50లక్షలు ఉంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి నగదుతో పాటు రూ.60వేల విలువైన సౌండ్ సిస్టం, ఇంట్లోని వస్తువులు కాలిబూడిదయ్యాయి. గమనించిన చుట్టుపక్కల వారు మంటలను అదుపులోకి తెచ్చేందుకు విఫలయత్నం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఆమనగల్లు: నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ ఉస్మానియా ఆస్పత్రిలో మంగళవారం మృతిచెందింది. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాకు చెందిన గోపీకి తలకొండపల్లి మండలం గౌరిపల్లితండాకు చెందిన మధుతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదనపు కట్నం తేవాలంటూ భర్తతో పాటు అత్తింటివారు వేధిస్తున్నారని మనస్తాపానికి గురైన మధు గత సోమవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను మొదట కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియాకు తరలించారు. ఈక్రమంలో మంగళవారం మధు మరణించింది. ఆమె తండ్రి దేవ్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గురుకుల విద్యార్థి అదృశ్యం

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన కె.అశ్రిత్ చిలుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల అనంతరం సోమవారం అశ్రిత్ పాఠశాలలో చేరాడు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో ప్రిన్సిపల్ దేవేందర్ మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పాము కాటుతో వలస కూలీ మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: పాముకాటుతో వలస కూలీ మృతి చెందిన సంఘటన ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం కొంగరకలాన్‌లో ఐకేసీ టెలీకమ్యూనికేషన్ ఇన్‌ఫ్రాలో పనిచేసే కూలీ దొంతర తిరుమలయ్య (32) పడుకుని ఉండగా మెడ వద్ద పాము కరిచింది. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రకాశం జిల్లాలోని జయరాంపూర్ ఇతని స్వగ్రామంగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెరువులో నీరు తగ్గడంతో గతేడాది మృత్యువాతపడిన చేపలు(ఫైల్)



మత్స్య పారిశ్రామిక సహకార భవనం

చేపల చెరువుపై వివాదం

ఆరేళ్లుగా చేపల చెరువు వివాదం పరిష్కారానికి నోచుకోవడం లేదు. ముదిరాజ్ కులస్తులు రెండు వర్గాలుగా విడిపోయి చేపలు పట్టడమే నిలిపివేశారు. ఫలితంగా అవి మృత్యువాత పడి దుర్గంధం వ్యాపించడంతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారు.

- రెండు గ్రూపులుగా విడిపోయిన హస్నాబాద్ ముదిరాజ్‌లు
- మత్స్యపారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వం కోసం డిమాండ్
- ఆరేళ్లుగా నిలిచిన చేపల వేట
- మృత్యువాత పడుతున్న చేపలు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్‌లో రెండు తరాల క్రితం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఏర్పడింది. ప్రస్తుతం వారి వారసులు 98 మందితో సంఘం కొనసాగుతోంది. వీరు ప్రైవేట్ వ్యక్తుల వద్ద చేప పిల్లలు కొనుగోలు చేసి చెరువులో వదిలేవారు. వాటిని పెంచి ప్రైవేట్ వ్యక్తికి అమ్మిన తర్వాత వచ్చిన ఆదాయాన్ని చేపపిల్లల ఖర్చు, చెరువు కాపలాదారుడి ఖర్చుతో పాటు గ్రామదేవత చింతల్ల మైసమ్మ బోనాల పండుగ నిర్వహిస్తుండేవారు.

కొత్త సభ్యత్వం కోసం..

ఆరేళ్ల క్రితం గ్రామంలోని ముదిరాజ్‌లు రెండువర్గాలుగా విడిపోయారు. 98 మంది సభ్యులున్న సంఘం ఓ వర్గం.. అందులో కొత్తగా సభ్యత్వం కోసం మరో వంద మందికి పైగా ముదిరాజ్‌లు మరో వర్గంగా ఏర్పాడ్డారు. సంఘం సభ్యులు చేపలు పట్టేందుకు యత్నిస్తే కొత్త సభ్యులకు సభ్యత్వం ఇచ్చిన తర్వాతే చేపలు పట్టాలని భీష్మించుకున్నారు. దీంతో ఆరేళ్లుగా చేపలు పట్టడం నిలిపివేశారు. పలుమార్లు పోలీసులు, రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా రెండు వర్గాల మధ్య సయోధ్య కుదర్చలేకపోయారు. ఈ రెండు వర్గాల సభ్యులు ఒక్కో పార్టీకి మద్దతు తెలుపుతున్న వర్గాలు కావడంతో సమస్య జటిలంగా మారేందుకు ఒక కారణమని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

గతేడాది పది లారీల చేపలు మృత్యువాత

ప్రభుత్వం అందజేసే ఉచిత చేపపిల్లల పంపిణీతో పాటు ప్రైవేట్ వ్యక్తుల దగ్గర కొనుగోలు చేసి ప్రతీ ఏడాది 20 లక్షల చేప పిల్లలు వదులుతున్నారు. ఆరేళ్లుగా చేపల వేట బందవడంతో అవి సైజ్ పెరిగి ఒత్తిడికి తట్టుకోలేక మృత్యువాత పడుతున్నాయి. గతేడాది మే, జూన్ మాసంలో చెరువులో నీరు తగ్గి దాదాపుగా 10 లారీల చేపలు మృత్యువాత పడ్డాయని.. ఫలితంగా సమీప పొలాల దుర్గంధం తట్టుకోలేక అటుగా వెళ్లలేదని చెబుతున్నారు. అనంతరం వర్షాలు కురవడంతో సమస్య తాత్కాలికంగా వాయిదా పడింది. ప్రస్తుతం చెరువులో నీరు తగ్గుముఖం పట్టాయని చేపలు చనిపోయే ప్రమాదం ఉందని, రెండు వర్గాలు కలిసి చేపలు పట్టుకోవాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.

పోలీసుల వద్దకు పంచాయితీ

రెండు రోజుల క్రితం సంఘం ఆధ్వర్యంలో చేపలు పట్టేందుకు యత్నించగా సభ్యత్వం కోరుతున్న వర్గం అడ్డుకోవడంతో మరోమారు వివాదం తెరపైకి వచ్చింది. విషయం పోలీసుల వద్దకు చేరడంతో పోలీసులు చేపల వేటను నిలిపి వేయించారు. ఇదే విషయమై కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డిని వివరణ కోరగా.. కొంత కాలంగా రెండు వర్గాలు మధ్య వివాదం సాగుతోందని, సయోధ్య కుదుర్చుకోవాలని సూచించాం. త్వరలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

న్యాయం జరిగే వరకు..



కులస్తులమంతా కలిసి చేపల చెరువును సాగు చేసుకుందాం. కొత్త మత్స్యకార సంఘం ఏర్పాటు చేసుకుని అందుకు అనుగుణంగా నడుచుకుందాం. చెరువుపై అందరికీ సమాన హక్కు ఉండాలి. న్యాయం జరిగే వరకు పోరాడుతాం.

– కొడంగంటి రాములు, గ్రామస్తుడు

సంఘంపై రూ.25లక్షల అప్పు



ఆరేళ్ల క్రితం ప్రైవేట్ వ్యక్తి దగ్గర చేప పిల్లలు కొనుగోలు చేసి చెరువులో వదిలాం. ఖర్చులు భరించాం. చెరువుకు కొన్నేళ్లుగా రకం కడుతున్నాం. కాపలాదారుడి ఖర్చులు భరించాం. గ్రామ దేవత బోనాల ఉత్సవాలు నిర్వహించాం. దాదాపు రూ.25లక్షలు సంఘం కోసం అప్పుచేశాం. ప్రస్తుతం చెరువులో ఉన్న చేపలు పట్టుకుని విక్రయించి అప్పులు తీర్చుతాం. తదనంతరం కొత్త సభ్యత్వాలు ఇస్తే తమకు అభ్యంతరం లేదు.

– ముదిగిండ్ల కృష్ణ, సంఘం సభ్యుడు

లక్ష్యసాధనకు శ్రమించాలి

తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న విక్రమ్ సింహారెడ్డి

తాండూరు టౌన్: విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలని మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఉచిత పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు అందజేస్తోందని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసిస్తూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచారని గుర్తు చేశారు. కళాశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ, బాగా చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్య నోడల్ అధికారి శంకర్ నాయక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లినాథప్ప తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ ఎదుట బీజేపీ, బీఆర్‌ఎస్ ధర్నా



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు

- ఎస్‌ఐ రవూఫ్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్
- విచారణ కోసం పిలిచి మతపరమైన దూషణలు చేశాడని ఆరోపణ
- సీఐ జోక్యంతో శాంతించిన ఆందోళనకారులు

బొంరాస్‌పేట: వాట్సప్ స్టేటస్ విషయంలో ఓ వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు పిలిచిన ఎస్‌ఐ అతనిపై మతపరమైన దూషణలు చేశాడని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని ఎన్కేపల్లికి చెందిన రవిచారి గత శనివారం తన వాట్సప్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా స్టేటస్ పెట్టుకున్నాడు. ఈ విషయమై కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో ఆదివారం అతన్ని పీఎస్‌కు పిలిపించారు. ఎస్‌ఐ లేకపోవడంతో మరుసటి రోజు రావాలని సిబ్బంది సూచించారు. సోమవారం స్టేషన్‌కు వెళ్లిన రవిచారిపై ఎస్‌ఐ రవూఫ్ కేసు నమోదు చేయించారు. అంతటితో ఆగకుండా బొట్టు ఎందుకు పెట్టుకున్నావ్. తుడిచేసెయ్ అంటూ తనను బెదిరించాడని రవిచారి ఆరోపించాడు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ, హిందూ సంఘాలు, బీఆర్‌ఎస్ నాయకులు ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ర్యాలీగా పీఎస్‌కు వెళ్లారు. ఎస్‌ఐ రవూఫ్ అక్కడ లేకపోవడంతో సీఐ శ్రీధర్‌రెడ్డి స్టేషన్‌కు చేరుకుని, ఆందోళనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసు అధికారులపై ఆరోపణలను సహించేది లేదన్నారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించడం సరికాదని, ఈవిషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

పర్సాపూర్‌లో ‘రైతు సంబురం’



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

హాజరైన అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్: మండల పరిధిలోని పర్సాపూర్ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు సంబురం కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల సందేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. 15 ఎకరాల్లోపు ఉన్న రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసినట్లు సీఎం పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, ఏఓ తులసి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, అంజద్, రైతులు పాల్గొన్నారు.

స్పందించారు.. ప్రాణం నిలిపారు



కొండల్‌తో మాట్లాడుతున్న పోలీసులు

ఆమనగల్లు: పట్టణ సమీపంలోని సురసముద్రం చెరువులో దూకిన యువకుడిని పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని మంగళపల్లికి చెందిన దుర్గాపురం కొండల్ కుటుంబ సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకోవాలని మంగళవారం చెరువులో దూకాడు. క్షణాల్లో స్పందించిన స్థానిక పోలీసులు మల్లయ్య, ఇబ్రహీం ఈతగాళ్ల సాయంతో కొండల్‌ను బయటకు తీసుకువచ్చారు. అనంతరం అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్ల భరోసా

కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్

మొయినాబాద్: తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు కర్షకుల ఖాతాల్లో జమచేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల్లో భరోసా కల్పించిందని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సహాయం అందిన సందర్భంగా మంగళవారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో రైతు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. 1,49,39,111 మంది రైతులకు రైతు భరోసా ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు సంజీవరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు గణేశ్‌గౌడ్, రాంరెడ్డి, మాజీ సర్పంచ్ రత్నం, మత్స్యకార విభాగం జిల్లా చైర్మన్ మహేందర్ ముదిరాజ్, నాయకులు అశోక్‌యాదవ్, కేబుల్ రాజు, భిక్షపతి, కరణ్, రాజుగౌడ్, మినాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ‘భరోసా’: కాంగ్రెస్

ఇబ్రహీంపట్నం: ఔటర్ రింగు రోడ్డును ఆనుకుని ఉన్న ఎనిమిది మండలాలకు చెందిన రైతులు ఆందోళన చెందవద్దని, అందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అవుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంకాల శేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన వారు భరోసా నిధుల విడుదలకు ఆదేశించారని తెలిపారు.

అమెరికా వెళ్లొచ్చేసరికి బీరువా ఖాళీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దుండగులు బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, ఐఫోన్, ఐపాడ్ ఎత్తుకెళ్లిన విషయమై ఆదిబట్ల పీఎస్‌లో కేసు నమోదైంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తుర్కయంజాల్‌లో నివాసం ఉండే సోమరౌతు శ్రీలక్ష్మి గత ఏప్రిల్ 18న అమెరికా వెళ్లింది. రెండు నెలల తర్వాత జూన్ 19న ఇంటికి చేరుకుంది. ఈ మధ్య కాలంలో తన బీరువాలో దాచిన సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు, ఐపాడ్, ఐఫోన్ చోరీకి చోరీకి గురయ్యాయని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, శ్రీలక్ష్మి కొడుకును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

భార్య మరణం తట్టుకోలేక..

పురుగు మందు తాగి భర్త బలవన్మరణం

మొయినాబాద్: భార్య మరణం జీర్ణించుకోలేక మనస్థాపానికి గురైన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని మేడిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన సాలె రమేశ్(35) కూలీ పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని భార్య పుష్పలత అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం మృతి చెందింది. దీంతో మనస్థాపానికి గురైన రమేశ్ ఈ నెల 22న ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో స్నానం చేసి ఇంట్లోకి వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి నోట్లో నుంచి నురుగలుకక్కుతూ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతని పక్కనే ఓ సీసాలో పురుగు మందు ఉంది. వెంటనే ఆయన్ను స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రమేశ్ మంగళవారం మృతి చెందాడు. తల్లి దండ్రులు చనిపోవడంతో ఇద్దరు కుమారులు అనాథలయ్యారని గ్రామస్తులు కంటతడిపెట్టారు. కేసు దర్యాప్తులో ఉంది.

భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై కేసు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో రూ.7 కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు గ్రామానికి చెందిన కొత్తపల్లి సుభాన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలోని ఓ మీసేవ నిర్వాహకుడితో కుమ్మక్కయ్యారు. బాధితుల సమాచారం మేరకు తహసీల్దార్ పార్థసారథి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు. సుభాన్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, నవనీత, దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మీ సేవ కేంద్రం నిర్వాహకులతో పాటుగా నలుగురు సాక్షులపై కేసు నమోదు చేసినట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అధిక ధరలకు సిలిండర్ విక్రయాలు

ఎస్‌ఓటీ పోలీసుల దాడులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎక్కువ ధరలకు అనుమతులు లేకుండా గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్న వారిపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. బొంగ్లూర్‌లో ఆటోలో 39 సిలిండర్లను ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. వీరి వద్ద ఎలాంటి కాగితాలు లేకపోవడంతో అనుమానంతో మహేశ్వరం ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు సంయుక్తంగా దాడి చేసి, సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గజ్జెల మాణిక్యం రెడ్డి, సీతా మహేష్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నక్కగుట్ట తండా సమీపంలో సోమవారం మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108లో ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

పశువుల సంతకు సర్కార్ భూమి

మాల్ పశువుల సంతకు సొంత స్థలం గ్రహణం వీడనుంది. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు ప్రభుత్వం నాలుగు ఎకరాల భూమిని కేటాయించేందుకు నిర్ణయించింది.

- మాల్ సర్వే నంబర్ 640లో నాలుగు ఎకరాలు కేటాయించాలని ఎమ్మెల్యే లేఖ
- సర్కార్ అంగీకారం
- సర్వే చేపట్టాలని తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



మాల్ సర్వే నంబరు 640లోని ప్రభుత్వ భూమి

యాచారం: మాల్ పశువుల సంతకు సొంత స్థలం లేక ఇన్నాళ్లు ప్రైవేట్ వెంచర్లలో కొనసాగించారు. ఇక్కడ ప్రతీ మంగళవారం నిర్వహించే సంతకు జిల్లా పరిధిలోని యాచారం, కందుకూరు, మంచాల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, మండలాలతో పాటు నల్గొండ జిల్లా మర్రిగూడ, చింతపల్లి, దేవరకొండ, నార్కాట్‌పల్లి మండలాల పరిధి గ్రామాల నుంచి వందలాది మంది రైతులు, వ్యాపారులు పశువులు తీసుకువచ్చి క్రయ విక్రయాలు జరుపుతుంటారు. ఈ సంత నిర్వహణతో గ్రామ పంచాయతీకి ప్రతీ ఏట రూ.80 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతుంది. దీంతో ఆత్మ నిర్భర్ పంచాయతీ ప్రత్యేక అవార్డుల్లో (ఏఎస్‌పీఎస్‌ఏ) మాల్ గ్రామ పంచాయతీ మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ప్రతీ ఏటా సంత నిర్వహణ వేలం ద్వారా వచ్చే లక్షలాది రూపాయల ఆదాయంతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

సర్కార్ అంగీకారం

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మాల్ పంచాయతీలో సర్వేనంబరు 640లో దాదాపు రూ.వంద కోట్ల విలువ చేసే 16–20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. జాతీయ స్థాయి అవార్డు అందుకున్న గ్రామంలో పశువుల సంత ఏర్పాటుకు శాశ్వత స్థలం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక అందజేశారు. స్థానికుల డిమాండ్ మేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సంత ఏర్పాటుకు నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇందుకు స్పందించిన సర్కార్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు తహసీల్దార్ సర్వే చేపట్టి హద్దుల ఏర్పాటు చేయనున్నారు.

మాంసం, చేపల విక్రయానికి మార్కెట్

పశువుల సంతకు శాశ్వత స్థలం ఉంటే మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రైవేట్ వెంచర్లలో నిర్వహిస్తుండడంతో టెంట్లు, తాగునీటి సరఫరా తదితర సౌకర్యాల కల్పనకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. వెంచర్ల యజమానులతో రైతులకు, వ్యాపారులకు వాగ్వాదం నిత్యకృత్యం. సంతకు కేటాయించే నాలుగు ఎకరాల్లో మాంసం, చేపల విక్రయానికి మార్కెట్ నిర్మించాలని అధికారులు యోచిస్తున్నారు. విశాలమైన స్థలం ఉంటే పశువులతో పాటు గొర్రెలు, మేకలు, వ్యవసాయ పనిముట్లు విక్రయించుకునే అవకాశం ఉంటుంది.

ఎమ్మెల్యే కృషితోనే



మాల్ పశువుల సంతకు సర్వే నంబరు 640లో శాశ్వత స్థలం కేటాయించాలని గతంలో పలుమార్లు అధికారులు, కలెక్టర్లు, మంత్రులకు విన్నవించాం. స్పందించిన వారే లేరు. ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషితో సంతకు నాలుగు ఎకరాల స్థలం కేటాయించడం సంతోషకరమైన విషయం. శాశ్వత స్థలముంటే సంత ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. – పి.కవిత, మాజీ సర్పంచ్, మాల్

సంత ఆదాయంతోనే అవార్డు



పశువుల సంత నిర్వహణ వల్ల ప్రతి ఏటా వచ్చే లక్షలాది రూపాయల ఆదాయంతోనే మాల్ గ్రామ పంచాయతీకి ఏఎస్‌పీఎస్‌ఏ అవార్డు వరించింది. రాష్ట్రంలో ఈ అవార్డు పొందిన ఏకైక గ్రామం మాల్. శాశ్వత స్థలం ఉంటే మరింత ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

– శ్రీలత, మండల పంచాయతీ అధికారి

కలెక్టర్ ఆదేశాలు అందాయి



మాల్‌లో సర్వే నంబరు 640లో పశువుల సంతకు నాలుగు ఎకరాల స్థలం కేటాయించాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. వెంటనే సర్వే చేపట్టి నాలుగు ఎకరాల స్థలానికి హద్దులు గుర్తించి, మ్యాప్ వేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తాం. నాలుగు ఎకరాలతో పాటు మొత్తం 16–20 ఎకరాల భూమిని సర్వే చేసి హద్దులు గుర్తిస్తాం. ఆక్రమణకు గురైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. – అయ్యప్ప, తహసీల్దార్ యాచారం